ఆంధ్రజ్యోతి



1,00,00,000,00,00,000
కోటి కోట్ల రూపాయల
స్కాం ఇండియా

స్వతంత్ర దేశంలో యథేచ్ఛగా అవినీతి.. వేల కోట్ల మేర దిగమింగిన ఘనులు
రాజకీయ నాయకులదే అగ్రస్థానం.. స్టాక్ మార్కెట్ కుంభకోణాలూ అధికమే
దొరికి.. శిక్షలు పడ్డవారు అతి తక్కువ.. ఎంచక్కా తప్పించుకున్న బాపతే ఎక్కువ!

1000000000000000 రూపాయలు...

ఏంటీ లెక్క పెట్టుకోలేకపోతున్నారా? అక్షరాలా కోటి కోట్ల రూపాయలు! ఇదంతా ఎక్కడిదనుకుంటున్నారా? మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన మరుసటి ఏడాది నుంచి దేశవ్యాప్తంగా జరిగిన కుంభకోణాల్లో దేశం నష్టపోయిన సొమ్మిది. లేదా.. కేవలం కొంతమంది అవినీతిపరుల జేబుల్లోకి వెళ్లిపోయిన జాతి సంపద. 1992 తర్వాతి నుంచి 2005 వరకు జరిగిన స్కాముల మొత్తం విలువ చూస్తేనే 73 లక్షల కోట్ల రూపాయలుగా లెక్కతేలింది. అది కూడా జాతీయ స్థాయిలో జరిగిన కుంభకోణాలు మాత్రమే. ఇవి కాక వివిధ ప్రభుత్వ విభాగాలలో జరిగిన అవినీతి, వివిధ రాష్ట్రాలలో చోటుచేసుకున్న అవినీతి.. ఇవన్నీ కలుపుకొంటే మన భారతదేశంలో అవినీతి లెక్క కోటి కోట్లకు పైమాటగానే తేలింది. పైగా.. టెలికం శాఖ మాజీ మంత్రి ఎ.రాజా 2జీ స్పెక్ట్రం స్కాము.. దేశ ఖజానాకు లక్షా 76 వేల కోట్లకు పైగా నష్టం కలిగించిన విషయాన్ని స్వయంగా కాగ్ స్పష్టంచేసింది. ఆ కేసు ఇప్పుడు సుప్రీంకోర్టులో విచారణలో ఉన్న విషయం కూడా తెలిసిందే. మన దేశానికి ఇప్పటివరకు (2009-10 నాటికి) ఉన్న అప్పు సుమారు రూ. 45. 35 లక్షల కోట్లు అని వికీపీడియా వెబ్‌సైట్ అంచనా వేసింది. అంటే స్వాహా అయిన సొమ్ములో సగం కంటే తక్కువ మొత్తంతోనే ఈ అప్పు తీరిపోతుందన్న మాట!! దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన మరుసటి సంవత్సరం నుంచే మొదలైన కుంభకోణాల పర్వం.. నాటి నుంచి నేటి వరకు నిర్విఘ్నంగా సాగిపోతోంది.

ఇదే సందర్భంలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్ మన దేశాన్ని అవినీతి రహిత దేశంగా తీర్చిదిద్దాలని, దేశంలోని రాజకీయాలకు 'కెమో థెరపీ' నిర్వహించాలని యువతకు పిలుపునిచ్చారు. భారతదేశానికి నీతిమంతులైన యువత కావాలని, దేశాన్ని అవినీతిరహితం చేయాలంటే మన ఇంటినుంచే అవినీతి, లంచగొండితనాలకు వ్యతిరేకంగా పోరాటం మొదలు కావాలని ఆయన సూచించారు. మరి కలామ్ బాటలో యువత నడుస్తుందా.. ఈ అవినీతి భూతాన్ని అంతం చేస్తుందా?

సంవత్సరం	స్కాం పేరు	విలువ రూ.కోట్లలో
1992	హర్షద్ మెహతా సెక్యూరిటీల స్కాం	5000
1994	చక్కెర దిగుమతి స్కాం	650
1995	ప్రిఫరెన్షియల్ అలాట్‌మెంట్ స్కాం	5000
	యుగస్లావ్ దీనార్ స్కాం	400
	మేఘాలయ అడవుల స్కాం	300
1996	ఎరువుల దిగుమతి స్కాం	1300
	యూరియా స్కాం	133
	బీహార్ పశువుల మేత స్కాం	950
1997	సుఖ్‌రాం టెలికం స్కాం	1500
	లఖీన్‌పవర్ ప్రాజెక్టు స్కాం	374
	బీహార్ భూ కుంభకోణం	400
	సీఆర్ భన్సాలీ స్టాకు కుంభకోణం	1200
1998	టేకు ప్లాంటేషన్ కుంభకోణం	8000
2001	యూటీఐ స్కాం	4800
	దినేష్ దాల్మియా స్టాకు స్కాం	595
	కేతన్ పరేఖ్ సెక్యూరిటీల స్కాం	1250
2002	సంజయ్ అగర్వాల్ ఇళ్ల స్కాం	600
2003	తెల్గీ స్టాంపు పేపర్ల కుంభకోణం	172
2005	ఐపీవో-డీమాట్ స్కాం	146
	బీహార్ వరద సహాయ కుంభకోణం	17
	స్కార్పియన్ జలాంతర్గాముల స్కాం	18978
2006	పంజాబ్ సిటీ సెంటర్ ప్రాజెక్టు స్కాం	1500
	తాజ్ కారిడార్ స్కాం	175
2008	హసన్ అలీ ఖాన్ పన్ను ఎగవేత	50000
	సత్యం స్కాము	10000
	ఆర్మీ రేషన్ దొంగతనం స్కాము	5000
	2జీ స్పెక్ట్రం	60000
	స్టేట్‌బ్యాంక్ ఆఫ్ సౌరాష్ట్ర స్కాం	95
	స్విస్ బ్యాంకులలో నల్లధనం (2008నాటికి)	7100000
2009	జార్ఖండ్ వైద్య పరికరాల స్కాం	130
	బియ్యం ఎగుమతి స్కాం	2500
	ఒడిషా గనుల స్కాం	7000
	మధుకోడా గనుల స్కాం	4000

ఎప్పుడు.. ఏమిటి.. ఎవరు?

1. **జీపుల కొనుగోళ్లు (1948):** దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాతి సంవత్సరమే తొలి అవినీతి కేసు బయటపడింది. బ్రిటన్‌లో భారత హై కమిషనర్ వీకే కృష్ణ మీనన్ ఓ విదేశీ కంపెనీ నుంచి ఆర్మీ జీపుల కొనుగోలుకు ప్రోటోకాల్ ఉల్లంఘించి రూ. 80 లక్షల ఒప్పందం చేసుకున్నారు. ఆయన నెహ్రూ మంత్రివర్గంలో చేరగానే 1955లో కేసు మూతపడింది.

2. **సైకిళ్ల దిగుమతి (1951):** ఓ కంపెనీకి సైకిళ్ల దిగుమతి అనుమతి ఇచ్చేందుకు నాటి వాణిజ్య, పారిశ్రామిక మంత్రిత్వశాఖ కార్యదర్శి ఎస్‌ఏ వెంకటరామన్ లంచం తీసుకుని.. జైలుకు వెళ్లారు.

3. **బీహెచ్‌యూ నిధులు(1956):** విద్యాసంస్థల్లో మొట్టమొదటి అవినీతి కుంభకోణమిది. రూ. 50 లక్షల నిధులను బెనారస్ హిందూ విశ్వవిద్యాలయ అధికారులు దుర్వినియోగం చేశారు.

4. **ముంద్రా కుంభకోణం (1957):** మీడియా బయటపెట్టిన కుంభకోణమిది. కోల్‌కతాకు చెందిన హరిదాస్ ముంద్రా అనే వ్యాపారి ఎల్ఐసీకి మోసపూరితంగా షేర్లు అమ్మారు. దీనిపై ప్రధాని నెహ్రూ జస్టిస్ ఎంసీ చాగ్లా కమిషన్ వేయగా.. అసలు లేని షేర్లను ముంద్రా అమ్మి, ఎల్ఐసీకి రూ. 1.25 కోట్ల నష్టం కలిగించినట్లు తేలింది. ముంద్రాకు 22 ఏళ్ల జైలుశిక్ష పడింది. నాటి ఆర్థిక మంత్రి టీటీ కృష్ణమాచారి రాజీనామా చేయాల్సి వచ్చింది.
5. **తేజ రుణాలు (1960):** జయంత్ షిప్పింగ్ కంపెనీని నెలకొల్పుతానంటూ నౌకారంగ దిగ్గజం జయంత్ ధర్మతేజ 22 కోట్ల రుణం తీసుకున్నారు. కానీ కంపెనీ పెట్టకుండా ఆ డబ్బుతో దేశం వదిలి ఉడాయించాడు.

6. **కైరాన్ స్కాం (1963):** తనతో పాటు కుమారులు, బంధువుల ప్రయోజనాల కోసం అధికార దుర్వినియోగం చేశారన్న ఆరోపణలు వచ్చిన తొలి ముఖ్యమంత్రి ప్రతాప్ సింగ్ కైరాన్. ఒక ఏడాది తర్వాత ఆయన రాజీనామా చేశారు.

7. **పట్నాయ్ సెల్ఫ్‌గోల్ (1965):** ఒడిషా ముఖ్యమంత్రి బిజు పట్నాయక్ తన సొంతదైన కళింగ ట్యూబ్స్ కంపెనీకి ప్రభుత్వ కాంట్రాక్టు ఇచ్చారని తేలడంతో రాజీనామా చేయాల్సి వచ్చింది.

8. **మారుతి కుంభకోణం (1974):** కంపెనీ ప్రారంభానికి ముందే.. కార్ల తయారీ లైసెన్సును తన కుమారుడు సంజయ్ గాంధీకి కట్టబెడుతున్నారంటూ ఇందిరాగాంధీ పేరు బయటికొచ్చింది.
9. **సోలంకి కుంభకోణం (1992):** బోఫోర్స్ లంచాల కేసు విచారణను ఆపేయాలంటూ విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి మాధవ్‌సింగ్‌సోలంకీ వరల్డ్ ఎకనమిక్ ఫోరంలో స్విట్జర్లండ్ విదేశాంగ మంత్రికి ఓ లేఖ ఇచ్చారు. ఆ విషయాన్ని ఇండియా టుడే ప్రచురించడంతో ఆయన రాజీనామా చేయాల్సి వచ్చింది.

10. **ఇంధన కుంభకోణం (1976):** అసలు లేని హాంకాంగ్ కంపెనీతో రూ. 2.2 కోట్ల ఇంధన కాంట్రాక్టును ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కుదుర్చుకుని, అందుకు లంచాలు పొందింది. ఈ కొనుగోళ్లు చేయాల్సిందిగా నాటి పెట్రోలియం, రసాయనాల శాఖ మంత్రి సూచించారు.
11. **అంతులే ట్రస్టు (1981):** సిమెంటు కంపెనీల నుంచి నాటి మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏ ఆర్ అంతులే రూ. 30 కోట్లు సేకరించి.. ఆ డబ్బును ఓ ప్రైవేటు ట్రస్టులో పెట్టారు.

12. **హెచ్‌డీడబ్ల్యు కమీషన్లు (1987):** జర్మన్ జలాంతర్గాముల కంపెనీ హెచ్‌డీడబ్ల్యు రూ. 20 కోట్ల కమీషన్లు ఇచ్చినట్లు తేలడంతో దాన్ని బ్లాక్‌లిస్టులో పెట్టారు. 2005లో ఈ కేసును మూసేశారు.

13. **బోఫోర్స్ లంచాలు (1987):** బోఫోర్స్ శతఘ్నుల కొనుగోళ్ల విషయంలో నాటి ప్రధాని రాజీవ్ గాంధీ సహా పలువురు భారతీయ ప్రముఖులకు రూ. 64 కోట్లు లంచాలిచ్చిందని స్వీడిష్ సంస్థ బోఫోర్స్‌పై ఆరోపణలు.

14. **సెయింట్ కిట్స్ ఫోర్జరీ (1989):** సెయింట్ కిట్స్‌లోని ఫస్ట్ ట్రస్ట్ కార్పొరేషన్‌లో తన కుమారుడు అజేయ సింగ్ ఖాతాలలో ఉన్న 2.1 కోట్ల డాలర్లకు వీపీ సింగ్ కూడా లబ్ధిదారుడని చూపేందుకు ఫోర్జరీ పత్రాలతో ప్రయత్నం జరిగింది.

15. **ఎయిర్‌బస్ కుంభకోణం (1990):** ఎ-320 విమానప్రమాదం జరిగిన తర్వాత కూడా.. ఎయిర్‌బస్ నుంచి విమానాల కొనుగోలుకు రూ. 2వేల కోట్లతో ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఒప్పందం. విమానాలు ఏమీ రాలేదుగానీ, ఒక్క వారంలోనే 2.5 కోట్ల నష్టం వాటిల్లింది.
16. **సెక్యూరిటీల స్కాం (1992):** పలు బ్యాంకులు తమ వద్ద ఉన్న డిపాజిట్ల సొమ్మును స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెట్టేలా హర్షద్ మెహతా మోసం.. ఒక్కసారిగా షేరు ధరల పతనం.. రూ. 5వేల కోట్ల నష్టం.

17. **ఇండియన్ బ్యాంకుకు కన్నం (1992):** దక్షిణాదికి చెందిన పలు చిన్న కార్పొరేషన్లు, ఎగుమతిదారులు ఇండియన్ బ్యాంకు ఛైర్మన్ ఎం.గోపాలకృష్ణన్ అండతో రూ. 1,300 కోట్ల రుణాలు తీసుకుని, వాటిని తిరిగి చెల్లించలేదు.
18. **చక్కెర దిగుమతి (1994):** మార్కెట్ ధర కంటే అధిక ధరకు చక్కెర దిగుమతి చేసుకోడానికి నాటి ఆరోగ్య మంత్రి కల్పనాథ్‌రాయ్ అనుమతులు.. ఖజానాకు రూ. 650 కోట్ల నష్టం.. ఫలితంగా మంత్రి రాజీనామా.

19. **ఎంఎస్ బూట్ల కుంభకోణం (1994):** ఎంఎస్ బూట్ల కంపెనీ అధిపతి పవన్ సచ్‌దేవా తన సొంత కంపెనీ పబ్లిక్ ఇష్యూకు వెళ్లడానికి ముందే.. అత్యంత తక్కువ ధరకు కంపెనీ నిధులతో షేర్లు కొన్నారు. సెబీ, ఎస్‌బీఐ కాప్స్ అధికారులతో కుమ్మక్కై ఇలా చేశారు. దాంతో ప్రజలు రూ. 699 కోట్లమేర పెట్టుబడులు పెట్టారు. తర్వాత ఇందులో సచ్‌దేవా తప్పు లేదని తేల్చారు.
20. **జేఎంఎం లంచాలు (1995):** పీవీ నరసింహారావు సర్కారును 1993నాటి అవిశ్వాస తీర్మానం నుంచి గట్టెక్కించడానికి తాను, మరో ముగ్గురు ఎంపీలు రూ. 30 లక్షల లంచం తీసుకున్నట్లు జార్ఖండ్ ముక్తి మోర్చా నేత శైలేంద్రమహతో అంగీకారం.

21. **పచ్చళ్ల వీరులు (1996):** తనకు కాగితపు గుజ్జు కాంట్రాక్టు ఇప్పించేందుకు నాటి ప్రధాని పీవీ నరసింహారావు, చంద్రస్వామి రూ. 10 లక్షల లంచం తీసుకున్నారంటూ పచ్చళ్ల కంపెనీ అధినేత లఖూభాయ్ పాఠక్ ఆరోపణలు.

22. **టెలికాం స్కాం (1996):** హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఓ ప్రైవేటు కంపెనీ నుంచి టెలికం పరికరాల కొనుగోలుకు సహకరించి, ఖజానాకు రూ.1.6 కోట్ల నష్టం కలిగించారని నాటి కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి సుఖ్‌రాంపై ఆరోపణలు. ఆయనతో పాటు మరో ఇద్దరికి 2002లో శిక్ష

23. **పశువుల మేత కుంభకోణం (1996):** పశువుల మేత కోసం అంటూ బీహార్ పశుసంవర్ధక శాఖ రూ. 950 కోట్లు విత్‌డ్రా చేసుకుంది. నాటి ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్‌కు ఇందులో భాగం ఉండటంతో ఆయన ఏడాది తర్వాత రాజీనామా చేశారు.



24. **యూరియా ఒప్పందం (1996):** రెండు లక్షల టన్నుల యూరియా దిగుమతి కోసం పీవీ ప్రభుత్వాన్ని ప్రభావితం చేసి రూ. 133 కోట్లు తీసుకున్న నేషనల్ ఫెర్టిలైజర్స్ ఎండీ సీఎస్ రామకృష్ణన్.. ఆ ఎరువులను పంపిణీ చేయలేదు.
25. **హవాలా డైరీలు (1996):** ఢిల్లీలో హవాలా ఆపరేటర్లపై 1991లో సీబీఐ దాడులతో ఈ కుంభకోణం వెలుగు చూసింది. వీటిలో ఎస్‌కే జైన్ డైరీలు సంచలనాలను సృష్టించాయి.

26. **సీఆర్‌బీ స్కాం (1997):** చైన్ రూప్‌భన్సాలీ అనే తెలివైన వ్యాపారి..పిరమిడ్ వ్యాపార సామ్రాజ్యాన్ని స్థాపించి వెయ్యి కోట్ల డిపాజిట్లు సేకరించారు. ఓ బ్యాంకింగ్ లైసెన్సు కూడా పొందారు. కానీ, ఆయన సమర్పించిన కొన్ని వారంట్లకు నగదు లేదని స్టేట్‌బ్యాంకులోని ఓ అధికారి కనుగొనడంతో బుడగ పగిలింది. అప్పటికే చిన్న మదుపుదారులు వెయ్యి కోట్లు నష్టపోయారు. భన్సాలీ అరెస్టయినా.. బెయిలు మీద విడుదలయ్యారు.
27. **మళ్లీ వచ్చిన మెహతా (1998):** బిగ్‌బుల్ హర్షద్ మెహతా మళ్లీ రంగప్రవేశం చేశాడు. బీపీఎల్, వీడియోకాన్, స్టెరిలైట్ కంపెనీల ప్రమోటర్లతో కుమ్మక్కై.. వాటి షేర్ల ధరలను పెంచేశాడు. తర్వాత ఇది కుప్పకూలింది. సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌లో డీలింగ్ చేయకుండా మెహతాను జీవిత కాలం డిబార్ చేశారు.

28. **కంపెనీల అదృశ్యం స్కాం (1998):** ఆర్థికమంత్రి చిదంబరం విన్న ఓ మాట దలాల్ స్ట్రీట్‌లో సంచలనం సృష్టించింది. కొన్ని వందల కంపెనీలు ప్రజాధనం సేకరించి, అదృశ్యమైపోతున్నాయని ఆయనకు తెలిసింది. తనిఖీ చేస్తే 600 కంపెనీలు లేవని తేలింది. వీటిలో 80 కంపెనీలు రూ. 330.78 కోట్లు సేకరించి, అదృశ్యమనట్లు సెబి తేల్చింది.
29. **ప్లాంటేషన్ కంపెనీల స్కాం (1999):** టేకు, స్ట్రాబెర్రీ.. లేదా ఏ పంటలైనా సాగు చేస్తామంటూ 653 కంపెనీలు మదుపుదారుల నుంచి రూ. 2,563 కోట్లు వసూలు చేశాయి. దిగుబడుల మాట.. వడ్డీలు అటుంచితే పెట్టుబడులు కూడా ఎవరికీ వెనక్కి రాలేదు.

30. **మ్యాచ్‌ఫిక్సింగ్ (2000):** భారత క్రికెట్ చరిత్రలో మాయనిమచ్చగా మిగిలిన అంకం. కెప్టెన్ మహ్మద్ అజహరుద్దీన్‌పై మ్యాచ్‌ఫిక్సింగ్ ఆరోపణలొచ్చాయి. అజారుతో పాటు అజయ్‌శర్మలపై నిషేధం విధించారు. అజయ్ జడేజా, మనోజ్ ప్రభాకర్‌లను ఐదేళ్లు సస్పెండ్ చేశారు.

31. **కేతన్ పరేఖ్ స్కాం (2001):** హర్షద్ మెహతా కంటే కేతన్‌పరేఖ్ కాకలు తీరిన స్కామువీరుడు. మెహతా బ్యాంకర్ల రసీదులను వాడితే, పరేఖ్ పేఆర్డర్లను వాడి తనకు కావల్సిన స్క్రిప్‌ల (కే-10) ధరలు పెంచేశాడు. బ్యాంకులతో పాటు హెచ్‌ఎఫ్‌సీఎల్ (425 కోట్లు), జీ (340 కోట్లు) గ్రూపులను ముంచేశాడు. మాధవ్‌పురా మర్కంటైల్ సహకార బ్యాంకు పే ఆర్డర్లు బౌన్స్‌యినప్పుడు దొరికాడు.

32. **తెహల్కా ఆపరేషన్ (2001):** లంచావతారులైన సైనిక అధికారులు, రాజకీయ నాయకుల గుట్టును రట్టుచేయడానికి తెహల్కా అనే న్యూస్ వెబ్‌సైట్ స్పైకెమెరాలు వాడింది. దీంతో దేశంలో పరిశోధనాత్మక జర్నలిజం కొత్తపుంతలు తొక్కింది.
33. **స్టాక్‌మార్కెట్ స్కాం (2001):** కేతన్ పరేఖ్ పుణ్యమాని 2001 మార్చిలో మార్కెట్ల నుంచి లక్షా పదిహేను వేల కోట్లు మాయమైపోయాయి. 2002 డిసెంబర్‌లో పరేఖ్‌ను అరెస్టు చేసి, మార్కెట్ నుంచి నిషేధించారు.
34. **హోం ట్రేడ్ స్కాం (2002):** నకిలీ ట్రేడింగ్ ముసుగులో మహారాష్ట్ర, గుజరాత్‌లలోని 25 సహకార బ్యాంకుల నుంచి నవీ ముంబైకి చెందిన హోంట్రేడ్ అనే కంపెనీ రూ. 600 కోట్లు మింగేసింది. కంపెనీ సీఈవో సంజయ్ అగర్వాల్‌ను అరెస్టుచేశారు.

35. **స్టాంపు పేపర్ల కుంభకోణం (2003):** అబ్దుల్ కరీం తెల్గీ చేసిన స్టాంపు పేపర్ల కుంభకోణం పుణ్యమాని దేశ ఖజానాకు రూ. 30 వేల కోట్ల నష్టం వాటిల్లింది. ఇందులో ఉన్నత పోలీసు అధికారులు, ఉన్నతాధికారులు ఉన్నారు. వాళ్లందరి పేర్లు కూడా తెల్గీ ఆ తర్వాతి కాలంలో బయటపెట్టాడు.

36. **ఆహారం కోసం చమురు స్కాం (2005):** ఇరాక్‌తో ఆహారం కోసం చమురు స్కాంపై వోకర్ నివేదిక వచ్చిన తర్వాత కేంద్ర మంత్రివర్గం నుంచి కె.నట్వర్ సింగ్‌ను తప్పించారు.

స్కాముల సొమ్ముతో ఏం చేయొచ్చు?

పీహెచ్‌సీలు

దేశంలో 2.4 కోట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నిర్మించవచ్చు. ప్రతి గ్రామానికి 3 కేంద్రాలు వస్తాయి.

కేవీలు

ఒక్కోటీ రూ. 3.02 కోట్ల ఖర్చుతో దేశవ్యాప్తంగా 24.1 లక్షల కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటుచేయొచ్చు.

ఇళ్లు



ఒక్కోటీ రూ. 5 లక్షల ఖర్చుతో 14.6 కోట్ల ఇళ్లను నిరుపేదల కోసం ఉచితంగా కట్టించి ఇవ్వచ్చు.

విద్యుత్తు

బొగ్గు ఆధారిత విద్యుత్‌ప్లాంట్లు ఒక్కోటీ 600 మెగావాట్ల సామర్థ్యంతో 2,703 ప్లాంట్లు పెట్టొచ్చు. ఒక్కోదానికి రూ. 2,700 కోట్లు ఖర్చవుతుంది.

బల్బులు

12 లక్షల సీఎఫ్ఎల్ బల్బులు సరఫరా చేయొచ్చు. భారతదేశంలోని ఆరు లక్షల గ్రామాలకు దీంతో వెలుగు వస్తుంది.

హైవేలు



14.6 లక్షల కిలోమీటర్ల మేర రెండు లేన్ల హైవేల నిర్మాణం చేయొచ్చు. అంటే భారతదేశం చుట్టూ 97 సార్లు తిరిగినట్లు.

నదులు

రాబోయే 121 సంవత్సరాల పాటు 50 ప్రధాన నదులను శుభ్రం చేయొచ్చు. ఒక్కో నదికి ఏటా రూ. 1,200 కోట్లు ఖర్చవుతుంది.

పథకాలు

గ్రామీణ ఉపాధి హామీ తరహా 90 పథకాలు ప్రవేశపెట్టొచ్చు. ఒక్కోదానికి సుమారు రూ. 81,111 కోట్లు ఖర్చవుతుంది.

రుణమాఫీ



121 రుణ మాఫీ పథకాలు ప్రకటించొచ్చు. వీటన్నింటికీ రూ. 60 వేల కోట్లు ఖర్చవుతుంది.

నగదు పంపిణీ

ప్రతి ఒక్క భారతీయుడికి రూ. 56 వేలు ఇవ్వొచ్చు. ఇంకా చెప్పాలంటే, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న 40 కోట్ల మంది భారతీయులు ప్రతివారికి రూ. 1.82 లక్షలు ఇవ్వొచ్చు.

నానో కార్లు

60.8 కోట్ల మంది ప్రజలకు టాటా నానో కార్లు ఇవ్వచ్చు. లేదా అంతకు నాలుగురెట్ల ల్యాప్‌టాప్‌లు ఇవ్వొచ్చు.

జీడీపీ



మన స్థూల జాతీయోత్పత్తి రూ. 53 లక్షల కోట్ల కన్నా స్కాంల ధనం 27% ఎక్కువ

ఘనుడికి భారీ జరిమానా

- గోవా నేతకు 1.72 కోట్ల ఫైన్
- అక్రమ గనుల తవ్వకానికి పాల్పడినట్టు సోదాల్లో వెల్లడి
- జరిమానా కట్టేందుకు ఎన్‌సీపీ నేత ససేమిరా..

పనాజీ, జనవరి 19 : వడ్డించేవాడు తనవాడే అయినా, ఆ నేతకి మాత్రం నడ్డి విరిగింది. అక్రమంగా గనులను తవ్వి ముడి ఖనిజాన్ని తరలించినందుకుగాను గోవాలో ప్రభుత్వ భాగస్వామ్య పక్షం ఎన్‌సీపీకి చెందిన నేత, ఆ పార్టీ జాతీయ కార్యదర్శి జితేంద్ర దేశ్‌ప్రభుకు అధికారులు 1.72 కోట్ల జరిమానా విధించారు. గనుల అక్రమాలు పెద్ద ఎత్తున వెలుగు చూస్తున్న ప్రస్తుత కాలంలో.. ఇంత భారీ జరిమానాను, అదీ అధికారంలో ఉన్న పార్టీ నేతపై విధించడం అసాధారణమైన విషయం. అయితే.. ఆ జరిమానా చెల్లించేందుకు జితేంద్ర ససేమిరా అంటున్నారు. ఈ నేపథ్యంలో.. ఆయన నుంచి ఆ సొమ్ము వసూలు చేసేందుకు గోవా మైనింగ్ అండ్ జియాలజీ డిపార్టుమెంటు చర్యలకు ఉపక్రమించింది. ఈ మేరకు సంబంధిత ప్రాంత రెవెన్యూ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. గనులు, సహజ వనరులు (అభివృద్ధి, క్రమబద్ధీకరణ) చట్టం-1957 ప్రకారం, గనుల తవ్వకాల్లో అక్రమాలకు పాల్పడిన వారికి నోటీసు జారీ చేసే అధికారం రెవెన్యూ యంత్రాంగానికి ఉంటుంది. పనాజీకి 50 కిలోమీటర్ల దూరంలో కార్గవో గ్రామంలోని క్వారీ నుంచి సదరు నేత అక్రమంగా ముడి ఖనిజం తవ్వినట్టు గత నెలలో గనుల అధికారులు జరిపిన సోదాల్లో వెలుగు చూసింది. క్వారీలోని యంత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తవ్వకాలను తక్షణం నిలిపివేయాలని జితేంద్రను ఆదేశించారు. దీనిపై వివరణ ఇచ్చేందుకు ఆయనకు వారం రోజుల గడువు ఇచ్చారు. అయినా.. ఆయన నుంచి స్పందన లేకపోవడంతో వసూలు చర్యలకు సమాయత్తమైనట్టు గనుల శాఖ వర్గాలు వెల్లడించాయి. అయితే, ఈ వ్యవహారంతో తనకు సంబంధం లేదని జితేంద్ర వాదిస్తున్నారు. క్వారీ సాగుతున్న స్థలం తనదేనని, దాన్ని తన వద్ద లీజుకు తీసుకున్న వ్యక్తి అక్కడ క్వారీ నిర్వహిస్తున్నారని ఆయన వివరిస్తున్నారు. ఆ క్వారీతో తనకు ఎలాంటి లావాదేవీలు లేవని చెబుతున్నారు.

రూ. 360 కోట్లు!

ఇది ఓ ఐఏఎస్ దంపతుల అక్రమార్జన
అవినీతి ఐఏఎస్‌లలో వీరిదే రికార్డ్
భోపాల్ ఐటీ దాడుల్లో బట్టబయలు

భోపాల్, జనవరి 19 : ఇదో ఐఏఎస్ దంపతుల అవినీతి కథ! మొగుడు పెళ్లాం కలిసి.. అధికారాన్ని అడ్డంపెట్టుకుని.. అడ్డదిడ్డంగా కూడబెట్టిన అక్రమార్జన! అంతో ఇంతో కాదు.. అక్షరాలా మూడు వందల అరవై కోట్ల రూపాయలు!! మధ్యప్రదేశ్‌కు చెందిన ఐఏఎస్ అధికారులైన ఆ దంపతుల ఇంటిపై వరుస దాడులు చేస్తే బయటపడిన ఈ ఆస్తులను చూసి.. ఆదాయ పన్ను అధికారులకు అధికారులకు దిమ్మతిరిగి.. మైండ్ బ్లాక్ అయ్యిందిట! ఘనత వహించిన ఆ అవినీతి దంపతుల పేర్లు.. అరవింద్ జోషి, టిను జోషి! వీరి ఇంటిపై ఐటీ దాడులు జరిగిన సమయానికి వారిద్దరూ అవినీతి ఆరోపణలపై సస్పెన్షన్‌లో ఉండటం విశేషం. వీరి ఇంట్లో దొరికిన ఆస్తులు.. వారి ఆదాయానికి మించి ఉన్నాయని ఐటీ వర్గాలు పేర్కొన్నాయి. ఇంత పెద్ద మొత్తంలో అక్రమాస్తులు గతంలో ఎన్నడూ దేశంలోనే ఏ అవినీతి ఐఏఎస్ వద్ద కూడా దొరకలేదని చెబుతున్నారు. దశల వారీగా జరిపిన సోదాల్లో ఈ ఆస్తులు వెలుగు చూశాయి. గత ఏడాది ఫిబ్రవరి 4న తొలి సారి జరిగిన సోదాల్లో లెక్కా పత్రం లేని మూడు కోట్ల రూపాయల ఆస్తులు బయటపడ్డాయి. 67 లక్షల రూపాయల విలువ చేసే నగలు, ఏడు లక్షల రూపాయల విలువ చేసే విదేశీ కరెన్సీ కూడా దొరికాయి. ఓ బీమా కంపెనీలో ఈ ఐఏఎస్ దంపతులు పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టారన్న ఫిర్యాదులతో ఈ దాడులు జరిగాయి. వీరి అక్రమాస్తుల తాలూకు పత్రాలు, ఎక్కడెక్కడ వీరి పెట్టుబడులు ఉన్నాయి? దాడుల తీరు తెన్నులు వగైరా వగైరా వివరాలను ఏడు వేల పేజీల నివేదికలో పొందుపరిచి మధ్యప్రదేశ్ సీఎస్ అవని వైశ్‌కు ఐటీ అధికారులు అందజేశారంటే.. వీరి అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. 1979 బ్యాచ్‌కు చెందిన మధ్యప్రదేశ్ ఐఏఎస్ అధికారులైన వీరిద్దరూ 1980లలో కేంద్రంలో కీలక బాధ్యతల్లో పని చేశారు. టిను 1988 నుంచి 1990 వరకూ ప్రధాని కార్యాలయంలో ఉప కార్యదర్శిగా పని చేశారు. అరవింద్ 1999లో కార్గిల్ ఘర్షణ సమయంలో రక్షణ శాఖలో సంయుక్త కార్యదర్శిగా ఉన్నారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వీరు ఇళ్ల స్థలాల్లో, పొలాల్లో కొనుగోలు చేశారు. వీరికి దేశంలో మొత్తం 25 ఫ్లాట్‌లు ఉన్నాయి. అందులో ఒక్క గౌహతిలోనే 18 ఫ్లాట్‌లు ఉన్నాయి. భోపాల్‌లో ఆరు, న్యూఢిల్లీలో ఒకటి ఉన్నాయి. స్పెక్యులేటివ్ ట్రేడింగ్‌లో షేర్లతో పాటు.. ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లో కూడా ఈ అవినీతి దంపతుల హస్తం ఉందని ఐటీ అధికారులు పేర్కొన్నారు.

నల్ల డబ్బు దేశ దోపిడీయే

- విదేశీ బ్యాంకుల్లో డిపాజిట్లపై ఏమిటీ నిష్క్రియాపరత్వం?
- సత్వరమే మొత్తం సమాచారాన్ని సమర్పించండి
- కేంద్రానికి సుప్రీం తలంటు

న్యూఢిల్లీ, జనవరి 19: దేశ సంపదను విదేశాల్లో దాచిపెట్టడం దేశాన్ని దోపిడీ చేయడమేనని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. విదేశీ బ్యాంకుల్లో భారతీయులు దాచిన నల్లధనానికి సంబంధించి సమాచారం ఇవ్వడానికి కేంద్రం ముందుకు రాకపోవడంపై అసంతృప్తి వ్యక్తంచేసింది. కేంద్ర నిష్క్రియాపరత్వంపై మండిపడింది. విదేశీబ్యాంకుల్లో నల్ల ధనాన్ని వెనక్కి రప్పించాలంటూ రామ్ జెఠ్మలానీ మరికొందరు దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి, జస్టిస్ ఎస్ఎస్ నిజ్జర్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం విచారించింది. ద్వంద్వపన్నుల తలాయింపు చట్టం కింద కేంద్రం తీసుకున్న చర్యలను సొలిసిటర్ జనరల్ గోపాల్ సుబ్రహ్మణ్యం కోర్టుకు విన్నవించినప్పుడు.. ''అలా దాచడం జాతి సొమ్మును దోపిడీ చేయడమే. కళ్లు చెదిరే, ఒళ్లు గగుర్పొడిచే నేరం గురించి మాట్లాడుతున్నాం తప్ప.. ఒప్పందాల్లోని అర్థచ్ఛాయా భేదాల గురించి కాదు'' అని బెంచ్ వ్యాఖ్యానించింది. జర్మనీలోని లీక్టెన్‌స్టీన్ బ్యాంకులో 26 మంది భారతీయులు దాచిన సొమ్ముపై అఫిడవిట్‌ను దాఖలు చేస్తూ ప్రభుత్వమే సమాచారాన్ని తొక్కిపెట్టడంపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. ''మీ దగ్గర ఉన్న మొత్తం సమాచారం ఇదేనా! ఇంకా ఉందా?''అని ప్రశ్నించింది. విదేశీబ్యాంకుల్లో భారతీయులు దాచిన నల్ల డబ్బు ఎంతోతెలిస్తే కళ్లు చెదరడం ఖాయమేనని సొలిసిటర్ జనరల్ అంగీకరించారు. వివిధ దేశాలతో చేసుకున్న ఒప్పందాల ఆధారంగానే యంత్రాంగం స్పందించాల్సి ఉంటుందని తమ పరిమితులు చెప్పారు. దీంతో, లీక్టెన్‌స్టీన్ బ్యాంకులో దాచిన సొమ్ము వివరాలను మాత్రమే ప్రభుత్వం అందజేయడంపైనా ధర్మాసనం ప్రశ్నించింది. రిట్ పిటిషన్‌కే తాము పరిమితమయ్యాయని సొలిసిటర్ జనరల్ వివరించగా.. ''పన్ను ఎగవేతలతో పనిలేదు. విదేశీ బ్యాంకుల్లో భారతీయులు దాచిన నల్ల డబ్బు మొత్తం వివరాలను సమర్పించండి'' అని స్పష్టం చేసింది. నల్ల డబ్బు దాచిన భారతీయుల పేర్లు వెల్లడించడానికి కూడా ప్రభుత్వ విముఖతపైనా అసంతృప్తి వ్యక్తం చేసిం ది. ప్రభుత్వం వద్ద ఆ సమాచారం ఉంద ని, కానీ బయటకు వెల్లడించడానికి సిద్ధం గా లేదని సొలిసిటర్ జనరల్ చెప్పారు.

విదేశీ బ్యాంకుల్లో ఉన్న నల్లడబ్బును వెనక్కి తెచ్చేందుకు తక్షణ పరిష్కారం ఏమీ లేదు. ఒప్పందాల్లో ఉన్న ఇబ్బందుల వల్ల ఆ సమాచారాన్ని ప్రభుత్వం బయటపెట్ట లేదు.
-ప్రధాని మన్మోహన్